సాక్షి నంద్యాల

శుక్రవారం । 28 । జూన్ । 2024




అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళారాధన వేదికపై గురువారం హైదరాబాద్‌కు చెందిన శివపార్వతి నృత్యాలయం వారి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



అల్పప్రాణులే.. హాని అధికం

వర్షాకాలంలో మొదలు కావడంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో దోమల బెడద పెరిగింది. దోమల కారణంగా వచ్చే మలేరియా. డెంగీ జ్వరపీడితులు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. 8లో▸



వజ్రాల వంకలో అదృష్ట వేట

శ్రీ లక్ష్మీ నర్స నరసింహస్వామి ఆలయ సమీపంలోని వజ్రాల వంకలో అదృష్ట వేట కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడి ప్రజలు భారీగా తరలివస్తున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు



భోజనం చేస్తున్న విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

కొలిమిగుండ్ల: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని డీఈఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం కొలిమిగుండ్ల మోడల్ స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులతో ఆయన మాట్లాడి నాణ్యత వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూనియర్ కాలేజీకి గ్రామీణ విద్యార్థినులు రాక పోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదురవుతుండటంతో మెరిట్ ఉన్న వారికి మాత్రమే హాస్టల్ వసతి కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉండటంతో డీఎస్సీ పూర్తయ్యే వరకు ప్రభుత్వం విద్యా వలంటీర్లను నియమించేందుకు ఏర్పాట్లు చేస్తుందన్నారు. కొలిమిగుండ్లలో భవిష్యత్‌లో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. డీఈఓ వెంట జిల్లా కో–ఆర్డినేటర్ రఘునాథరెడ్డి, ఎంఈఓ అబ్దుల్ కలాం ఉన్నారు.

మహానంది ఈఓ బదిలీ

- కోటప్పకొండ ఈఓకు అదనపు బాధ్యతలు

మహానంది: మహానంది ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డిపై బదిలీ వేటు పడింది. వయోజన విద్యాశాఖలో పనిచేస్తున్న ఆయన 2022 ఫిబ్రవరి 22న ఈఓగా బాధ్యతలు తీసుకుని ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. దేవస్థానంలో ఏళ్ల తరబడి వేర్లకు పాతుకుపోయిన అవినీతిని, అనధికార అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేసి ఆలయ ఆదాయాన్ని అమాంతంగా పెంచారు. అయితే కొత్త ప్రభుత్వం రావడంతో ఆయనపై బదిలీ వేటు వేస్తూ కమిషనర్ కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోవాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేశారని తెలిసింది. కోటప్పకొండ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డికి మహానంది ఈఓగా పూర్తి అదనపు బాధ్యతలు కల్పిస్తూ దేవదాయశాఖ కమిషనర్ గురువారం ఆదేశాలు జారీ చేశారని దేవస్థానం వర్గాలు తెలిపాయి. శ్రీనివాసరెడ్డి స్థానిక శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి బంధువని స్థానికులు చర్చించుకుంటున్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించండి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ నిర్మల

మిడుతూరు: ఆటాపాటలతో విద్యనందించే అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను తప్పక చేర్పించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మల అన్నారు. గురువారం ఉప్పలదడియ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ చిన్నారుల జీవితంలో మొదటి ఆరు సంవత్సరాలు కీలక దశ అని, ఈ దశలో పిల్లలకు అందించే ప్రేరణ, అనుభవాలు వారి భవిష్యత్తుకు సంపూర్ణ అభివృద్ధికి, వ్యక్తిత్వ వికాసానికి పునాది వేస్తుందన్నారు. మూడేళ్ల నుంచి ఆరు సంవత్సరాల చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. కేంద్రాలలో తల్లులకు, గర్భిణులు, చిన్నారులకు అందించే సేవలను వివరించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున నాయక్, సీడీపీఓ కోటేశ్వరమ్మ, అసిస్టెంట్ సీడీపీఓ మంగవల్లీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వరలక్ష్మి, రేణుకాదేవి పాల్గొన్నారు.

భద్రతకు 'లైసెన్స్'

డ్రైవింగ్ లైసెన్సే కదా.. తీసుకుందాం లే.. ఊర్లో పోలీసులు మన వాహనాన్ని ఆపరు. ఒకవేళ ఆపితే వందో రెండు వందలో చెల్లిస్తే సరిపోతుంది. రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లి పరీక్ష ఉత్తీర్ణత కావడం... ఆపై అధికారుల ముందు వాహనాన్ని నడపటం కష్టం... సమయం వచ్చినప్పుడు చూద్దాం... అనుకునే వాహన చోదకులు ఒక విషయం గుర్తుంచుకోవాల్సి ఉంది. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ప్రమాదాలు జరిగితే ప్రభుత్వ పథకాలు చేతికి అందవు. అందుకే వాహనం నడిపే ప్రతి ఒక్కరూ లైసెన్స్ తీసుకోవాలి. వాహనదారుడి భద్రతకు ఇది ఎంతో మేలు చేస్తుంది.

–కర్నూలు/నంద్యాల(న్యూటౌన్)

- డ్రైవింగ్ లైసెన్స్‌తో ఎన్నో ఉపయోగాలు
- ఇంటి నుంచే ఎల్ఎల్ఆర్ దరఖాస్తుకు అవకాశం
- అనుమతులు లేని రవాణాతో నష్టాలే !



రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం



ఉమ్మడి కర్నూలు జిల్లాలో డిప్యూటీ కమిషనర్ కార్యాలయం, ఆదోని, నంద్యాలలో ప్రాంతీయ రవాణా కార్యాలయాలు, డోన్, ఆత్మకూరులో ఎంవీఐ కార్యాలయాలు ఉన్నాయి. కర్నూలు ప్రాంతీయ కార్యాలయంలో రోజుకు 50 నుంచి 60 మంది వరకు స్లాట్ ప్రకారం ఎల్ఎల్ఆర్(లెర్నర్స్ లైసెన్స్) పరీక్షకు హాజరవుతున్నారు. ఆదోని, నంద్యాల ప్రాంతీయ కార్యాలయాల్లో కూడా ఇదే మోతాదులోనే స్లాట్‌ల ప్రకారం ఎల్ఎల్ఆర్ పరీక్షలకు హాజరవుతున్నట్లు ఆయా కార్యాలయాల గణాంకాల ద్వారా తెలుస్తోంది. కోడుమూరు, కల్లూరు, గూడూరు, వెల్దుర్తి, కృష్ణగిరి, సి.బెళగల్, కర్నూలు రూరల్ మండలాలు కర్నూలు ప్రాంతీయ రవాణా కార్యాలయ పరిధిలోకి వస్తాయి.

సేవలు సులభతరం

వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఎల్ఎల్ఆర్ అనుమతి పత్రాలు మంజూరు చేయడానికి ప్రభుత్వం రవాణా సేవలను సులభతరం చేసింది. గతంలో ప్రజల ముంగిట రవాణా శాఖ పేరుతో 'మేళా' కార్యక్రమం కూడా నిర్వహించేవారు. రవాణా శాఖ అధికారులు ప్రతి ఏటా కళాశాలలకు వెళ్లి ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ లైసెన్స్‌ల ఆవశ్యకత గురించి వివరించి అనుమతులు ఇచ్చారు. ఇంటర్నెట్‌పై అవగాహన ఉన్నవారు ఎల్ఎల్ఆర్ కోసం ఇంటి నుంచే దరఖాస్తు చేసుకోవచ్చు. మీ సేవ కేంద్రాల్లో కూడా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. స్లాట్ ప్రకారం పరీక్షలో ఉత్తీర్ణులైన తర్వాత అధికారుల ముందు వాహనాలు నడిపి అనుమతులు పొందవచ్చు.

అరకొర డ్రైవింగ్‌తో రోడ్డెక్కేస్తున్నారు

ప్రతి కుటుంబానికి సరాసరి రెండు లేదా మూడు వాహనాలు కనిపిస్తున్నాయి. ఇంట్లోని పెద్దాచిన్న తేడా లేకుండా రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతూ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. మానవుల జీవితానికి తక్షణ అవసరంగా మారిన వాహనాలను నడపటానికి ముందు రహదారి నిబంధనలు తెలుసుకోవాలి. ఆ తర్వాత రవాణా శాఖ నుంచి డ్రైవింగ్ లైసెన్స్ తీసుకుని ఆపై రోడ్డుపైకి రావాలి. ఇవేవీ పట్టించుకోకుండా అరకొర డ్రైవింగ్ నేర్చుకుని రోడ్డేస్తున్నారు. ఇలాంటి వారి వల్ల ఎదుటివారి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.

కంప్యూటర్‌పై అవగాహన లేక అవస్థలు

డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు అవసరమైన సూచికల పరీక్షలో కంప్యూటర్ వినియోగించడం మినహా మరో మార్గం లేకపోగా ఉత్తీర్ణత సాధించాలంటే మాక్ టెస్టు ద్వారా ముందస్తుగా సాధన చేయడం తప్పనిసరిగా మారింది. కర్నూలు డీటీసీ కార్యాలయంలో రోజుకు కనీసం 50 నుంచి 60 మంది చొప్పున నెలకు 3 వేలు, ఏడాదికి 36 వేల మంది వరకు డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. వీరిలో 95 శాతం మంది అక్షరాస్యత కలిగి ఉన్నప్పటికీ కంప్యూటర్ వినియోగించడంలో కనీస నైపుణ్యం లేనివారికి ఇబ్బందులు తప్పడం లేదు. కంప్యూటర్‌పై అవగాహన ఉన్నవారే సూచికల పరీక్షలో బోల్తా పడుతుండగా ఏమాత్రం తెలియని వారి పరిస్థితి మరింత గందరగోళంగా మారి లైసెన్స్ తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా రోడ్డెక్కితే జరిగే నష్టాలు, కష్టాలు ఇవీ..

- రక్షణాత్మక డ్రైవింగ్ తెలియక తమతో పాటు ఎదుటి వాహనదారులను మృత్యు కోరల్లోకి తీసుకెళ్తారు.
- మృతులకు ప్రభుత్వం అందించే ప్రమాద బీమా బాధిత కుటుంబాలకు అందదు.
- ప్రమాదంలో మరణించినవారికి ఇచ్చే రెట్టింపు ఇన్సూరెన్స్ రాదు. క్షతగాత్రులకు మెరుగైన ఉచిత వైద్యసేవలు అందవు.
- ప్రాణాలతో బయటపడితే చట్ట ప్రకారం శిక్షార్హులవుతారు.
- రహదారుల నిబంధనలపై పూర్తిస్థాయి అవగాహన ఉండదు.
- మలుపుల వద్ద, వేగ నియంత్రికలు (స్పీడ్ బ్రేకర్లు) వద్ద రక్షణాత్మక డ్రైవింగ్ చేయలేరు.

నంద్యాల కార్యాలయంలో మూడు సంవత్సరాలుగా లైసెన్స్‌ల జారీ...

సంవత్సరం	జారీ చేసిన మొత్తం లైసెన్స్‌లు
2021-22	2,150
2022-23	3,525
2023-24	4,032

నిర్లక్ష్యం వద్దు



సొంత వాహనాల్లో వెళ్లాలనుకునేవారు డ్రైవింగ్ నేర్చుకుంటున్నప్పటికీ లైసెన్స్ తీసుకునే విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపటం నేరం. ట్రాఫిక్ నిబంధనలను తెలుసుకోవాలి. డ్రైవింగ్‌లో పూర్తిస్థాయి శిక్షణ తీసుకోవాలి. ఆ తర్వాత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని స్లాట్ ప్రకారం ఎల్ఎల్ఆర్ పరీక్షలో ఉత్తీర్ణులై అధికారుల ముందు వాహనాలు నడిపి అనుమతి (లైసెన్స్) పొందవచ్చు.

– శివారెడ్డి, ఆర్‌టీఓ

ఇవీ తెలుసుకోవాలి..

- గేర్లు లేని 50 సీసీలోపు ఇంజిన్ ఉన్న ద్విచక్ర వాహనాన్ని నడపడానికి 16 ఏళ్ల వయస్సు నిండి ఉండాలి. తల్లిదండ్రుల, సంరక్షకుల అనుమతి పత్రం తప్పనిసరి.
- గేర్లు లేకున్నా ఉన్నా 50సీసీ మించిన ద్విచక్ర వాహనం నడపాలంటే 18 ఏళ్ల వయస్సు, లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి.
- కారు, జీపు నడపడానికి 19 ఏళ్ల వయస్సు ఉండి లైసెన్స్ తీసుకోవాలి.
- లారీ, బస్సు, ట్యాక్సీలు నడపడానికి 20 ఏళ్ల వయస్సు నిండి.. హెవీ వెహికల్ లైసెన్స్‌తోపాటు ఏడాది అనుభవం ఉండాలి.



డ్రైవింగ్ టెస్టుకు వచ్చిన వాహనదారులు

రుణ లక్ష్యాన్ని సాధించాలి

- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: ఈ ఆర్థిక సంవత్సరం బ్యాంకు లింకేజీ కింద అర్హులైన స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం నిర్దేశించిన రుణ మంజూరు లక్ష్యంలో ప్రగతి సాధించాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు డీఆర్‌డీఏ, సెర్ప్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో డీఆర్‌డీఏ, సెర్ప్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ కింద ఈ ఆర్థిక సంవత్సరం 22,317 స్వయం సహాయక సంఘాలకు రూ.1,370 కోట్ల రుణాల మంజూరు లక్ష్యాన్ని అధిగమించేందుకు ప్రత్యేక కృషి చేయాలన్నారు. ప్రభుత్వం కేటాయించిన లక్ష్యాన్ని క్షేత్రస్థాయిలో నెలవారీ లక్ష్యంగా నిర్దేశించుకుని ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాలలోని సభ్యులకు వ్యక్తిగత రుణాలు ఇప్పించేందుకు కూడా ప్రభుత్వం రూ.90.36 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించిందన్నారు. ఈ మేరకు జిల్లాలోని 6,450 మందికి వ్యక్తిగత రుణాలు ఇప్పించేందుకు కృషి చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాలలో సభ్యులు నెలవారి జమ చేసుకున్న పొదుపును బ్యాంకుల్లో అలాగే ఉంచకుండా అంతర్గత అప్పులు తీసుకునే సౌకర్యం కలిగించాలన్నారు. జిల్లాలో దాదాపుగా రూ.254 కోట్లు బ్యాంకులలో వృథాగా ఉందని ఈ మొత్తాన్ని అంతర్గత రుణాలు ఇచ్చుకునే విధంగా సంబంధిత సీసీలు, ఏపీఎంలు, ఏరియా కోఆర్డినేటర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. తీసుకున్న రుణాలు వారి జీవనోపాధులు చేసుకునేటట్లుగా ప్రోత్సహించాలన్నారు. స్త్రీనిధి, ఉన్నతి పథకాల ద్వారా తీసుకున్న రుణాలను వంద శాతం రికవరీ చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి డీపీఎం, ఏరియా కోఆర్డినేటర్స్ పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి వంద పని దినాలు కల్పించండి

జాతీయ ఉపాధి హామీ పథకం కింద ప్రతి పేద కుటుంబానికి వంద పని దినాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ రామచంద్రారెడ్డిని ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఉపాధి హామీ పనుల ప్రగతిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం కింద వివిధ రకాల పనులను గుర్తించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు వంద శాతం పనులు కల్పించడంతోపాటు ప్రతి పేద కుటుంబానికి వందరోజుల పని దినాలు కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద జిల్లాకు కేటాయించిన పనిదినాల సంఖ్య 45 లక్షలకు గాను ఇప్పటి వరకు 44 లక్షల పూర్తి చేసినట్లు కలెక్టర్‌కు పీడీ నివేదించారు. పండ్ల తోటల పెంపకానికి సంబంధించి పనులు గుర్తించి ఎస్టిమేట్ ప్రతిపాదనలు సమర్పిస్తే పరిపాలన అనుమతులు మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. వర్షాలు కురిసి భూములు మెత్తగా ఉన్న నేపథ్యంలో ఫారం పాండ్స్ నిర్మాణాలతో పాటు మినీ అమృత్ సరోవర్ల నిర్మాణాలకు రైతులను ప్రోత్సహించాలన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

మద్దిలేటయ్య హుండీ ఆదాయం రూ.24.42 లక్షలు

బేతంచెర్ల: ఆర్ఎస్ రంగాపురం శివార్లల్లో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి హుండీ ఆదాయం రూ. 24,42,001 వచ్చింది. స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించిన కానుకలు, ముడుపుల హుండీ లెక్కింపును గురువారం చేపట్టారు. దేవదాయశాఖ అధికారి శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షణలో 30 రోజులకు సంబంధించిన కానుకలు లెక్కించారు. ఈ సందర్భంగా రూ. 24,42,001 నగదు, 36 గ్రాముల బంగారు, 1.410 కిలో గ్రాముల వెండి వచ్చినట్లు ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు, చైర్మన్ సీతారామచంద్రుడు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు సుశీల, రామచంద్రుడు భక్తులు ఆకుల రమణ, మద్దయ్య, అర్చకులు పాల్గొన్నారు.



హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

హోటళ్లు, రెస్టారెంట్లను పరిశుభ్రంగా ఉంచండి

- జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి



నంద్యాల: వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని హోటళ్లు, రెస్టారెంట్లు ఇతర తినుబండారాల విక్రయశాలలు తప్పనిసరిగా పరిశుభ్రంగా ఉంచాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ముఖ్యంగా వంట గదుల్లో క్రిమికీటకాలు ప్రవేశించకుండా నియంత్రణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శాఖాహార, మాంసాహార పదార్థాల తయారీలో నాసిరకం ముడి సరుకులు, కృత్రిమ రసాయన రంగులు, టేస్టింగ్ సాల్ట్ తదితర పదార్థాలు వినియోగించినా, మిగిలిపోయిన ఆహార పదార్థాలు ఫ్రిడ్జ్‌లో నిల్వ చేసి విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సురక్షిత మంచినీటితో పాటు వేడి వేడిగా ఉన్న ఆహార పదార్థాలను వినియోగదారులకు సరఫరా చేయాలని సూచించారు. హోటళ్లు, రెస్టారెంట్ల సిబ్బందికి హెడ్ క్యాప్స్, యూనిఫామ్స్ తప్పక ధరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హోటళ్లు, రెస్టారెంట్ల కౌంటర్‌లో ఎఫ్ఎస్ఎస్ఏఐ ఫుడ్ లైసెన్స్ వినియోగదారులందరికీ కనపడేలా ప్రదర్శించాలన్నారు. కుళ్లిన, చెడిపోయిన ఆహార పదార్థాలు విక్రయించే హోటళ్లు, రెస్టారెంట్లపై జిల్లా ఆహార భద్రత కార్యాలయం, డోర్ నెం. 28-14-66, రైల్వే స్టేషన్ రోడ్, నూనెపల్లె, నంద్యాల జిల్లా వారికి లిఖిత పూర్వకంగా, 9441439787, 9441114429, 9494937578 నంబర్లకు ఫిర్యాదు చేసినా చట్ట పరంగా సంబంధిత సంస్థలు, వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు.

పింఛన్ల పంపిణీకి రంగం సిద్ధం

- ఉమ్మడి జిల్లాలో 4,67,469 పింఛన్లకు రూ.317.57 కోట్లు

కర్నూలు(అగ్రికల్చర్): జూలై నెల పెన్షన్ల పంపిణీకి రంగం సిద్ధమైంది. సాధ్యమైనంత వరకు 1వ తేదీనే వంద శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎవరైనా 1వ తేదీ పింఛను తీసుకోలేకపోతే 2వ తేదీన విధిగా పంపిణీ చేయాల్సి ఉంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 4,67,469 పింఛన్ల పంపిణీకి రూ.317.57 కోట్లు విడుదల కానున్నాయి. ఈ నెల 30న ఆదివారం కావడంతో ఈ నెల 29న పింఛన్లకు సంబంధించిన నగదును బ్యాంకుల నుంచి డ్రా చేసుకోనున్నారు. ఒకటో తేదీ ఉదయం 6 గంటల నుంచే పంపిణీని మొదలు పెట్టేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 11 కేటగిరీల పింఛన్లకు ఏప్రిల్, మే, జూన్ నెలల అరియర్స్ రూ.3000 కలిపి జూలై 1న పెంచిన పింఛను రూ.4వేలతో కలిపి మొత్తం రూ.7వేలు పంపిణీ చేయనున్నారు.

- వికలాంగులు, కుష్టు వ్యాధిగ్రస్తులకు(లెప్రసీ) ఇదివరకున్న పింఛను మొత్తం రూ.3వేలను రూ.6వేలకు పెంపు.
- వీల్ చైర్‌లు, బెడ్‌కు పరిమితమైన వికలాంగులు, ప్రమాదాలకు గురై కాళ్లు, చేతులు కోల్పోయిన వారికి ఇదివరకు ఇస్తున్న రూ.5వేల పింఛను రూ.15వేలకు పెంపు.
- కిడ్నీ, తలసీమియా, లివర్ అండ్ హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్, డయాలసిస్ పేషెంట్లకు రూ.5వేలు ఉన్న పింఛను మొత్తం రూ.10వేలకు పెంపు.
- సీకేడీయూ డయాలసిస్ ప్రయివేటు, సీకేడీయు డయాలసిస్ ప్రభుత్వ ఆసుపత్రి, తలసీమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులు, తీవ్ర హెమోఫీలియా, సైనిక్ వెల్ఫేర్, అభయహస్తం పింఛన్లలో ఎలాంటి మార్పు లేదు. అదేవిధంగా వీరందరికీ అరియర్స్ వర్తించదు.

ఇంటి దగ్గరే పింఛన్ల పంపిణీ

జూలై నెల పింఛన్లను గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో ఇంటి దగ్గరే పంపిణీ చేయనున్నారు. కర్నూలు జిల్లాలో 4,973 మంది, నంద్యాల జిల్లాలో 4,667 మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. ఒక్కో ఉద్యోగికి 50 చొప్పున పింఛన్ల పంపిణీ బాధ్యత అప్పగించనున్నారు.

6 గంటల నుంచే మొదలు

నంద్యాల: సచివాలయ ఉద్యోగుల ద్వారా పెన్షన్లను పంపిణీ చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాదు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పెన్షన్ల పంపిణీపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక్కో సచివాలయ ఉద్యోగికి 50 మంది పెన్షనర్లను మ్యాప్ చేసి ఒకటో తేదీ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల్లోపు పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలన్నారు. అదనంగా సిబ్బంది అవసరమైతే గ్రేడ్–4 నుంచి గ్రేడు–1 కేడర్ పంచాయతీ కార్యదర్శులను వినియోగించుకోవాలన్నారు.

పర్సన్ ఇన్‌చార్జ్‌గా జేసీ

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు, సహకార మార్కెటింగ్ సొసైటీలకు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కొద్ది రోజులుగా అఫీషియల్, నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్‌లు లేకపోవడంతో పలు కార్యక్రమాలు ఆగిపోయాయి. కేడీసీసీ బ్యాంకుకు జీవో ఆర్‌టీ నంబరు 405, కేడీసీఎంఎస్‌కు జీవో ఆర్‌టీ నంబరు 404 ద్వారా ఎట్టకేలకు జాయింట్ కలెక్టర్‌ను అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ ప్రభుత్వం సహకార శాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీ బి.రాజశేఖర్ రెండు జీవోలు జారీ చేశారు. ఒకటి రెండు రోజుల్లో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య బాధ్యతలు స్వీకరిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. ఎన్నికలు జరిగే వరకు లేదంటే ఆరు నెలల వరకు జేసీ ఆ బాధ్యతల్లో కొనసాగనున్నారు.

చిరుత సంచారంతో అప్రమత్తం

- అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్ మీనా

మహానంది: మహానంది పరిసరాల్లో చిరుతపులి సంచరిస్తున్న నేపథ్యంలో భక్తులు, స్థానికులు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్ మీనా, ప్రాజెక్ట్ టైగర్ ఫీల్డ్ డైరెక్టర్ మూర్తి హెచ్చరించారు. మహానంది దేవస్థానం ప్రాంగణంలో చిరుతపులి సంచరిస్తున్న నేపథ్యంలో వారు గురువారం గోశాల, మహానంది పరిసరాలను పరిశీలించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ సిబ్బందితో వివిధ అంశాలపై మాట్లాడారు. ఈ మేరకు డీడీ అనురాగ్ మీనా మాట్లాడుతూ అడవి సమీపంలోని గోశాలను దూరంగా తరలించడం మంచిదని, గోవులను చిరుత వేటాడే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుతానికి గోశాల, మాడవీధుల్లో అడవిని ఆనుకుని ఉన్న పరిసరాల్లో గ్రీన్‌మ్యాట్‌ను అడ్డుగా కట్టేలా ఏర్పాటు చేస్తే వచ్చే అవకాశం ఉండదని సూచించారు. మహానంది, పచ్చర్ల ప్రాంతాల్లో సంచరిస్తున్న చిరుతపులులను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు బోన్లు ఏర్పాటు చేశామన్నారు. ఆలయం వేళలు రాత్రి 9.30 గంటల వరకు ఉంటాయని, అదే సమయానికి కొద్దిరోజులు షాపులు మూసేస్తే మంచిదన్నారు. వారి వెంట ఎఫ్ఆర్ఓ దినేష్‌కుమార్‌రెడ్డి, డీఆర్ఓలు హైమావతి, నాగేంద్రనాయక్, ఎఫ్‌బీఓ ప్రతాప్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.



మహానంది పరిసరాల్లో ఈఓ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

వృద్ధాశ్రమాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కర్నూలు(అర్బన్): జిల్లాలో వృద్ధాశ్రమాల ఏర్పాటు, నిర్వహణకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా కోరారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ ధృవ పత్రం కోసం రూ.100 డీడీ లేదా క్రాస్ చేసిన చెక్కును సంచాలకులు, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, విజయవాడ పేరిట తీసి ఫారం 'ఎం' లో వివరాలను పొందుపరచాలన్నారు. ఈ ఫారాన్ని కలెక్టరేట్‌లోని తమ కార్యాలయానికి పంపాలన్నారు. ఇప్పటికే వృద్ధాశ్రమాలు నిర్వహిస్తుంటే, వెంటనే రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సేద్యం.. అద్వితీయం

మినుము పైరులో కలుపు సమస్య పెరిగిపోవడం.. కూలీలు దొరకకపోవడంతో ఓ రైతు వినూత్నంగా ఆలోచించాడు. ఎద్దుల కాడికి రెండు గుంటికలు కట్టి అంతర సేద్యం చేశాడు. ఈ దృశ్యం నందికొట్కూరు మండలం 10 బొల్లవరం గ్రామ సమీపంలో గురువారం దర్శనమిచ్చింది. - సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు



అల్పప్రాణులే.. హాని అధికం

- వర్షాకాలంలో మొదలైన దోమల బెడద
- ప్రబలుతున్న మలేరియా, డెంగీ
- నివారణ చర్యలే ఉత్తమం



కర్నూలు(హాస్పిటల్): వర్షాకాలం మొదలు కావడంతో దోమలు, ఈగల బెడద మళ్లీ మొదలైంది. ఒకవైపు దోమలు రాత్రి వేళ ఇంట్లో దూరి మనుషుల రక్తం తాగుతుండగా మరోవైపు బహిరంగ ప్రదేశాల్లో ఉంచి ఆహార పదార్థాలపై ఈగలు వాలి వ్యాధులను కలుగజేస్తున్నాయి. ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే వీటి బారి నుంచి మనల్ని మనం కాపాడుకోగలం. అల్పప్రాణులే కదా అని వదిలే అవి మన ప్రాణం మీదకు తీసుకురావడం ఖాయం. దోమలు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే ముందుగా అవి పుట్టకుండా చేయాలి. ఆ మేరకు ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజలు సహకరించాలి.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వర్షాకాలం ప్రారంభమైంది. అక్కడక్కాడా వర్షాలు కురుస్తున్నా యి. ఫలితంగా చెరువులు, కుంటల్లో నీరు నిలుస్తున్నాయి. ఖాళీ ప్రదేశాల్లోనూ నీరు నిలిచి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. వేసవి కాలం నుంచే కేసీ కాలువలో మురుగు నిలిచి ఉంది. ఇటీవల అధికారులు దీనిని శుభ్రం చేసినా అది కూడా అరకొరగానే పూర్తి చేశారు. దీంతో కేసీ కెనాల్ పరిసర ప్రాంతాల ప్రజలకు దోమల బెడద తప్పడం లేదు. మరోవైపు హంద్రీలోనూ అక్కడక్కడా నీరు నిలిచి ఉంటోంది. హంద్రీ పరివాహక ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో పాటు మురికికాలువల్లో ప్రజలు నిర్లక్ష్యంగా వేసే చెత్తా చెదారంతోపూడుకుపోతున్నాయి. ఈ కారణంగా కాలువల్లో నీరు ప్రవహించేందుకు వీలులేక నిలిచిపోతున్నాయి. ఇందులో దోమలు వృద్ధి చెంది వ్యాపిస్తున్నాయి. చీకటి పడితే చాలు కనిపించిన వారిని కనిపించినట్లు కుట్టిపారేస్తున్నాయి. ఈ క్రమంలో దోమల కారణంగా వచ్చే మలేరియా, డెంగీ జ్వరపీడితులు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. పల్లెల్లో మాత్రం సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లు, పట్టణాల్లోని మురికివాడల్లో అర్బన్‌హెల్త్ సెంటర్లు తెరిచే ఉన్నాయి. మరోవైపు కాస్త ఆర్థిక స్థోమత ఉన్న వారు ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్నారు. ప్రజలకు అవసరమైన చికిత్సను ఇవి అందిస్తున్నాయి. ఈ దశలో దోమకాటుకు గురయ్యే బదులు వాటిని పుట్టకుండా చేయడమే మనముందున్న లక్ష్యమని వైద్యులు, అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో దోమకాటు వ్యాధుల వివరాలు

సంవత్సరం	మలేరియా	మెదడువాపు	డెంగీ	చికున్‌గున్యా
2020	14	0	10	0
2021	16	0	170	2
2022	6	3	342	0
2023	4	0	409	0
2024(ఇప్పటి వరకు)	4	2	187	1

డెంగీ : ఏడిస్ ఈజిప్టి అనే దోమ ద్వారా డెంగీ వ్యాధి వస్తుంది. అకస్మాత్తుగా వచ్చే ఎముకలు, కండరాలు, కీళ్లనొప్పులతో కూడిన తీవ్రజ్వరం వస్తుంది. ఈ దోమలు పగటిపూట మాత్రమే కుడతాయి. తీవ్రమైన జ్వరం, శరీరంపై దద్దుర్లు, చర్మం ద్వారా రక్తస్రావం, తీవ్రమైన తలనొప్పి ఉంటుంది. తగ్గినట్లుగా అనిపించి వారం, పదిరోజుల్లో తిరగబెడుతుంది. చిగుళ్ల, ముక్కు, మలం ద్వారా రక్తం పోవడం డెంగీ హేమరేజ్ వ్యాధి లక్షణాలు. అయితే డెంగీ వైరస్ సోకిన అందరికీ వ్యాధి రాదు. అందువల్ల జ్వరం గురించి అంతగా భయపడాల్సిన అవసరం లేదు.

దోమకాటు వల్ల వచ్చే వ్యాధులు

మలేరియా: ఆడ అనఫిలిస్ దోమకాటుతో వస్తుంది. ఇది మంచినీటి నిల్వల్లో పెరిగి వ్యాధిని వ్యాపింపజేస్తుంది.

లక్షణాలు : చలి, వణుకుతో కూడిన జ్వరం, చెమటలు పట్టడం, తలనొప్పి, జ్వరం రోజు విడిచి రోజు రావడం , వాంతులు అవడం.

➡ ప్లాస్మోడియా జాతికి చెందిన రెండు రకాల క్రిముల వల్ల మన ప్రాంతంలో మలేరియా వస్తుంది. వైవాక్ మలేరియా అంత తీవ్రం కాకపోయినా ఎక్కువ కాలం బాధిస్తుంది. ఫాల్సీపారం ప్రాణాంతకం కావచ్చు. చికిత్స పాటు నివారణ చర్యలు కూడా మంచి ఫలితాన్నిస్తాయి.

మెదడువాపు వ్యాధి: హఠాత్తుగా వచ్చే విపరీతమైన జ్వరం, తలనొప్పి, వాంతులు, స్పృహతప్పడం వంటి లక్షణాలు ఉంటాయి. ముఖ్యంగా చిన్నపిల్లల్లో మరణాలు సంభవించవచ్చు. లేకపోతే శాశ్వ త అంగవైకల్యం కలుగుతుంది. పంట పొలాల్లో విస్తారమైన నీటి నిల్వల్లో పెరిగే క్యూలెక్స్ రకానికి చెందిన దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ప్రధానంగా అక్టోబర్, నవంబర్ నెలల్లో నా లుగు నుంచి 12 సంవత్సరాల పిల్లల్లో ఈ వ్యాధి ఎక్కువగా ప్రబలుతుంది. ప్రస్తుతం ఈ వ్యాధి నియంత్రణకు టీకా మందు అందుబాటులో ఉంది.

బోదకాలువ్యాధి(ఫైలేరియా): క్యూలెక్స్ దోమకాటు వల్ల వచ్చే ఈ వ్యాధి ఎవరికైనా రావచ్చు. ఈ వ్యాధి వల్ల ఎలాంటి తీవ్ర పరిమాణాలకు దారితీయనప్పటికీ వ్యాధిగ్రస్తుల మానసిక వ్యథ, శారీరక ఇబ్బందులు ఎక్కువ. తరచూ జ్వరం రావడం, చంకల్లో, వృషణాల్లో వాపు, కాళ్లలో నీరసం, కాళ్లవాపు, ప్రత్యేకించి కళ్లు, చేతులు, స్థనాలు, జననేంద్రియాలు పొడవడం ఈ వ్యాధి ముఖ్యలక్షణాలు.

చికున్ గున్యా : చికున్ గున్యా వ్యాధి దోమల ద్వారా వస్తుంది. వైరస్ కారక దోమ పగటి పూట మాత్రమే కుడుతుంది. జ్వరం, వాంతులు, వికారంతో హఠాత్తుగా వచ్చే జ్వరం, చేతివేళ్లు, కాళ్ల నుంచి మొదలుకొని శరీరంలోని అన్ని కీళ్లను బాధిస్తుంది. కీళ్లనొప్పుల వల్ల సరిగ్గా నిలబడలేని పరిస్థితి. జ్వరం తగ్గినా ఈ నొప్పులు ఎక్కువ కాలం ఉంటాయి. ఈ వ్యాధికి ప్రత్యేకమైన చికిత్స లేదు. లక్షణాలను బట్టి వైద్యసహాయం అందిస్తారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



దోమలు డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, ఫైలేరియా, మెదడు వాపు వంటి ప్రాణాంతక వ్యాధులను కలుగజేస్తాయి. అవి కుట్టాక చికిత్స చేయించుకోవడం కంటే అవి పుట్టకుండా చర్యలు తీసుకోవడమే ఉత్తమం. ప్రజలు ఇల్లు, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. ఇంటి పరిసరాల్లో పనికిరాని కూలర్లు, టైర్లు, కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ బకెట్స్, మగ్గులు దూరంగా పారేయాలి. మలేరియా విభాగం ద్వారా దోమల నిర్మూలన చర్యలను అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా చేపడుతున్నాం.

–నూకరాజు, మలేరియా అధికారి, కర్నూలు

దోమల నివారణ చర్యలు

- ➡ ఇంటి పరిసరాల్లో దోమలు పెరిగే నీటి నిల్వలను నిర్మూలించాలి.
- ➡ తాగి పారేసిన కొబ్బరిబోండాలను ముక్కలుగా చేసి చెత్తకుండీలో వేయాలి.
- ➡ ఓవర్‌హెడ్ ట్యాంకులు, నీటినిల్వ పాత్రలు, ఎయిర్ కూలర్లు, డ్రమ్ములు పూర్తిగా ఖాళీ చేసి శుభ్రం చేయాలి.
- ➡ కాల్వలో వ్యర్థాలు, చెత్త, చెట్లకొమ్మలు వేయరాదు.
- ➡ వారానికి ఒకసారి పూలతొట్టిలలో, పూల కుండీలలో నీరు మార్చాలి. నీరు నిల్వ ఉండకుండా చూడాలి.
- ➡ దోమలు లోపలికి రాకుండా కిటికీలకు సన్న జాలిని కట్టాలి. దోమతెరలు తప్పనిసరిగా వాడాలి.
- ➡ ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలి.
- ➡ టైర్లు, రోడ్డుపై గుంతలో వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి.
- ➡ జ్వరం వచ్చిన వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదించాలి.

క్లుప్తంగా

ఆర్‌యూలో ఎంటీఎస్ చేయలేదు

- వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ నాగుల అంకన్న

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో బోధనేతర ఉద్యోగులు 25 మందికి మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) వర్తింపు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లుగా వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని రిజిస్ట్రార్ డాక్టర్ నాగుల అంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. రాయలసీమ విశ్వవిద్యాలయ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ బి. సుధీర్ ప్రేమ్‌కుమార్ సెలవుపై వెళ్లడంతో రిజిస్ట్రార్ సొంత నిర్ణయాలు తీసుకుంటున్నట్లు వస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని పేర్కొన్నారు. అసలు వర్సిటీ వీసీ సెలవుపై వెళ్లలేదని తెలిపారు. కొన్ని పత్రికల్లో వస్తున్న వార్తల్లో ఏమాత్రం వాస్తవం లేదని తెలిపారు. చాలా కాలంగా వర్సిటీలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది జీతాల విషయాన్ని పరిశీలించడానికి గత వారం ఓ కమిటీని నియమించామని పేర్కొన్నారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ నాగుల అంకన్న, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సీవీ కృష్ణారెడ్డి, ఎగ్జామినేషన్స్ డీన్ ఆచార్య పీవీ సుందరానంద్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు అందులో సభ్యులుగా ఉన్నారని తెలిపారు. ఈ కమిటీ 26వ తేదీన సమావేశమై బోధనేతర సిబ్బంది జీతాల పెంపుదలను పరిశీలించవలసిందిగా మాత్రమే విశ్వవిద్యాలయానికి సూచించిందని తెలిపారు. మినిమం టైం స్కేల్‌కు సంబంధించి అసలు చర్చే జరగనప్పుడు టైం స్కేల్ అమలు చేయడానికి నిర్ణయించినట్లు చెప్పడం సరికాదని పేర్కొన్నారు.

రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోండి

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలకు చెందిన జవాబు పత్రాల రీ వెరిఫికేషన్‌కు https://bie.ap.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని డీఐఈఓ సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28వ తేదీ నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు ఇంటర్మీడియెట్ బోర్డు అవకాశం కల్పించిందన్నారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పది సప్లిమెంటరీ పరీక్షలకూ..

పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు విద్యార్థులు రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఈనెల 28 నుంచి జూలై 1వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని డీఈఓ సుధాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి సప్లిమెంటరీ మార్క్స్ మెమోను www.bsc.ap.gov.inలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తులను హెచ్‌ఎంలు ఆన్‌లైన్‌లో చేస్తారన్నారు.

యాగంటి కేవీకేకు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మి

బనగానపల్లె: యాగంటిపల్లె గ్రామ సమీపంలోని కృషి విజ్ఞాన కేంద్రానికి (కేవీకే) ఉత్తమ అవార్డు దక్కింది. వీఆర్ గూడెంలోని వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం, జాతీయ పొగాకు పరిశోధన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రాజమండ్రిలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు జోన్–10 కేవీకేల వార్షిక జోనల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్యక్రమాల ప్రగతిని యాగంటి కేవీకే శాస్త్రవేత్తలు వివరించారు. రైతుల ఆదాయం పెంచే దిశగా నాణ్యమైన విత్తనాలు అందించడం, నారు మొక్కలను పెంచే సదుపాయం, భూసార పరీక్షల ద్వారా ఎరువుల యాజమాన్యం ప్రోత్సాహించడం వంటి కార్యక్రమలు చేపట్టినందుకు ఉత్తమ కేవీకే అవార్డు లభించిందని సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మి తెలిపారు. భారతీయ వ్యవసాయ పరిశోధన, విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో 2023–24 సంవత్సరానికి గాను జోనల్‌లోని 72 కేవీకేల్లో యాగంటి కేవీకే ఉత్తమ అవార్డు దక్కిందన్నారు.

బీసీ హాస్టళ్లలో ఫౌండేషన్ ప్రోగ్రాం పరీక్ష

కర్నూలు(అర్బన్): జిల్లాలోని అన్ని వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాల్లో గురువారం సాయంత్రం ఫౌండేషన్ ప్రోగ్రాంకు సంబంధించి ప్రీటెస్ట్ నిర్వహించారు. హాస్టళ్లలోని విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిషు, మ్యాథ్స్‌లో బేసిక్ నైపుణ్యాలను మెరుగుపరచేందుకు జూలై 1న ప్రారంభించి 45 రోజుల వరకు ఈ ప్రోగ్రామ్‌ను నిర్వహించనున్నారు. కలెక్టరేట్ సమీపంలోని బీసీ బాలికల వసతి గృహంలో నిర్వహించిన ప్రీటెస్ట్‌ను జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణి పీ వెంకటలక్ష్మమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు వీలుగా ఈ విద్యా సంవత్సరంలో నూతనంగా ఫౌండేషన్ ప్రోగ్రాం అమలు చేస్తున్నామన్నారు. విద్యార్థినీ, విద్యార్థులను గ్రూపులుగా విభజించి హాస్టళ్లలో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తామన్నారు. నైపుణ్యాలు అభివృద్ధి చెందితే సులభంగా అన్ని పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణులయ్యేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం మూడు సబ్జెక్టులపై ఫోకస్ పెట్టామన్నారు. ఫలితాలను అనుసరించి మిగిలిన సబ్జెక్టులపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రభుత్వ బీసీ సంక్షేమ వసతి గృహాల్లో వంద శాతం ఫలితాలే లక్ష్యంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు వసతి గృహ సంక్షేమాధికారులు కూడా అంకిత భావంతో పనిచేస్తున్నారన్నారు.



కలెక్టరేట్ సమీపంలోని వసతి గృహంలో పరీక్షను పరిశీలిస్తున్న వెంకటలక్షుమ్మ



తెర్నేకల్ బీసీ బాలుర వసతి గృహంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

చంద్రబాబుపై మరో పోరాటానికి సిద్ధం

- అంబేడ్కర్ విగ్రహం ఎదుట పీవీ రావు మాల మహానాడు నిరసన

కర్నూలు(అర్బన్): రిజర్వేషన్లలో ఎస్సీ వర్గీకరణకు ప్రయత్నాలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుపై మాలలు మరో పోరాటానికి సిద్ధం కావాలని పీవీ రావు మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం నరసప్ప, జిల్లా అధ్యక్షుడు కే మాధవస్వామి పిలుపునిచ్చారు. కుప్పం పర్యటనలో భాగంగా ఎస్సీ వర్గీకరణ చేస్తామని చంద్రబాబు ప్రకటించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్నూలు పాత బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట గురువారం మాల మహానాడు నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. చంద్రబాబు మొదటి నుంచి మాలల ద్వేషి గానే ప్రవర్తిస్తున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణ ద్వారానే దళితుల్లో సామాజిక న్యాయం వస్తుందని చెప్పడం సిగ్గుచేటన్నారు. సామాజిక న్యాయంపై చంద్రబాబుకు నమ్మకం ఉంటే తన మంత్రివర్గ కూర్పులో ఎస్సీలకు కేవలం రెండు మంత్రి పదవులు మాత్ర మే ఇచ్చి ఎందుకు అన్యాయం చేశారని ప్రశ్నించారు. పీవీ రావు త్యాగం, సుప్రీంకోర్టు తీర్పును కాపాడుకోవాల్సిన బాధ్యత మాలలపై ఉందన్నారు. మాల కులాన్నే శాశ్వతంగా నామరూపాలు లేకుండా చేయాలనే చంద్రబాబు కుట్రలను తిప్పికొట్టాలన్నారు. నిరసనలో నాయకులు పీ శివశంకర్, పీ జయరామ్, చిరంజీవీ, పీ జయన్న తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

యువకుడి ఆత్మహత్యపై అనుమానం

- పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం

చాగలమర్రి: పూడ్చిన శవాన్ని వెలికి తీసి పోస్టుమార్టం చేసిన సంఘటన మండల కేంద్రం చాగలమర్రిలో గురువారం చోటు చేసుకుంది. స్థానిక కోటగడ్డ వీధికి చెందిన ముల్లా సయ్యద్ అబ్దుల్ మునాఫ్ (25) అనే వ్యక్తి ఈ నెల 16వ తేదీ అర్ధరాత్రి తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబీకులు మరుసటి రోజు మృతదేహాన్ని స్థానిక అరబ్ మసీదు పక్కనే ఖననం చేశారు. కాగా 11 రోజుల తరువాత అతని మృతిపై అనుమానం ఉందని భార్య రిజ్వానా చాగలమర్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం వైద్యులు, అధికారులతో గ్రామానికి చేరుకుని పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది చేత పూడ్చిన మృతదేహాన్ని వెలికితీయించారు. అనంతరం తహసీల్దార్ వెంకటరవణమ్మ సమక్షంలో నంద్యాల మెడికల్ కళాశాల ఫోరెన్సిక్ వైద్య నిపుణులు ప్రొఫెసర్ రాజశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ హరికృష్ణల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహం నుంచి నమూనాలను సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు.



ముల్లా సయ్యద్ అబ్దుల్ మునాఫ్ (ఫైల్)



పోలీసుల సమక్షంలో శవాన్ని వెలికి తీస్తున్న దృశ్యం

పొగాకు వాడకంతో క్యాన్సర్ ముప్పు





కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, హాజరైన వైద్యులు, సిబ్బంది

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): పొగాకు ఏ రూపంలో వాడినా క్యాన్సర్‌కు దారి తీస్తుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ అన్నారు. కొందరు ధూమపానం, మద్యపానం, గుట్కా వంటి వ్యసనాలకు అలవాటు పడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ లెక్చరర్ గ్యాలరీలో క్యాన్సర్ స్క్రీనింగ్ మూడో బ్యాచ్ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే చికిత్స ద్వారా నయం చేసుకోవచ్చన్నారు. ఊపిరితిత్తులు, నోటి, రొమ్ము/గర్భాశయ, కడుపు, అన్న వాహిక, లివర్ క్యాన్సర్లపై ప్రజల్లో ఉన్న అపోహలను ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో నివృత్తి చేయాలన్నారు. నోటిలో వాపు, తెల్లగా, ఎర్రగా వచ్చిన మచ్చలు ఉన్నా, ముక్కు నుంచి, నోటి నుంచి రక్తం వచ్చినా వైద్యులను సంప్రదించాలన్నారు. ఆహారపు అలవాట్లలో మార్పులు, జంక్‌ఫుడ్, కల్తీ ఆహారం కారణంగా అన్నవాహిక, పేగుల్లో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌సీడీ అధికారిణి హేమలత, డాక్టర్ శైలేష్‌కుమార్, డాక్టర్ సాహితి జయరామ్, డాక్టర్ పుష్పలత, డాక్టర్ మంజూషా, ప్రాజెక్టనిస్టు ఖలీల్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లమల ఘాట్‌లో రిగ్గు లారీ బోల్తా



గాయపడిన కార్మికులు

మహానంది: నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులో రిగ్గు లారీ ప్రమాదవశాత్తూ లోయలో బోల్తా పడింది. ఘటనలో ఆరుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. రాజస్థాన్‌కు చెందిన రిగ్గు లారీ గిద్దలూరు నుంచి నంద్యాల వైపు వస్తుండగా దొరబావి వంతెన వద్దకు వచ్చే సరికి బ్రేకులు ఫెయిలయ్యాయి. దీంతో ప్రమాదకర మలుపు ఉండటంతో అదుపు తప్పిన లారీ లోయలోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో రాజస్థాన్‌కు చెందిన డ్రైవర్ జీవన్‌లాల్, కార్మికులు నారాయణ, ప్రకాష్, శ్యామ్‌లాల్‌తో పాటు మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద విషయం తెలుసుకున్న హైవే రోడ్‌సేఫ్టీ వాహన డ్రైవర్ రసూల్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను 108లో నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలై రహదారిపై రోదిస్తున్న కార్మికులకు వాహనదారులు మానవత్వంతో సేవలందించారు.



లోయలో పడిన రిగ్గు లారీ

రాక్‌గార్డెన్‌లో సినిమా షూటింగ్

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లు సమీపంలోని రాక్‌గార్డెన్‌లో గురువారం సినిమా షూటింగ్ ప్రారంభమైంది. సితారా ఎంటర్‌ప్రైజెస్ ప్రొడక్షన్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'ఎన్‌బికే–109' చిత్రానికి సూర్యదేవర నాగవంశీ నిర్మాతగా, బాబి దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో ప్రముఖ తెలుగు హీరో నందమూరి బాలకృష్ణ, ప్రగ్యాజైస్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్నట్లు తెలిపారు. తొలి రోజు అడవిబిడ్డలతో పాట సన్నివేశాన్ని చిత్రీకరించారు. షూటింగ్ ప్రదేశంలో ఎవ్వరూ రాకుండా భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి షూటింగ్ వద్దకు వెళ్లి బాలకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.



పాటను చిత్రీకరిస్తున్న దృశ్యం

వజ్రాల వంకలో అదృష్ట వేట



వజ్రాల వంకలో వెతుకుతున్న ప్రజలు

మహానంది: నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులోని శ్రీ లక్ష్మీ సర్వ నరసింహ స్వామి ఆలయ సమీపంలో ఉన్న వజ్రాల వంకలో వజ్రాన్వేషణ కోసం ప్రజలు భారీగా తరలివచ్చారు. వర్షాలు కురుస్తుండటంతో వజ్రాలు దొరుకుతున్నాయనే ప్రచారం జరుగుతుండంతో పలు ప్రాంతాల నుంచి ప్రజలు ఇక్కడికి చేరుకుని తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కొందరైతే రోజులకు సరిపడ వంటసామగ్రి తెచ్చుకుని ఇక్కడే ఉంటున్నారు. రాత్రి ఆలయ పరిసరాల్లో సేద తీరుతున్నారు. కొందరికి రంగురాళ్లు, మరికొందరికి ఓ మోస్తరు ధర పలికే వజ్రాలు దొరుకుతున్నట్లు స్థానికులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

హొళగుంద: నెరణికి గ్రామానికి చెందిన బోయ సోమశేఖర్(25) అనే యువకుడు గురువారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యువకుడికి తల్లి బొళగటమ్మ, భార్య శ్రీదేవి ఉంది. ఇటీవలే కూతురు పుట్టింది. వీరంతా కలిసి బెంగళూరుకు వలస వెళ్లి అక్కడే ఉంటున్నారు. భార్య కాన్పు కోసం పుట్టినిల్లు హెబ్బటం వెళ్లగా ఇటీవలే గ్రామానికి వచ్చిన శేఖర్ మద్యం మానుకో లేక జీవితం పై విరక్తి చెంది గురువారం ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

నర్సరీలపై ప్రత్యేక దృష్టి

కర్నూలు(అగ్రికల్చర్): నర్సరీలపై ఉద్యాన అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి(డీహెచ్‌వో) పి.రామాంజనేయులు ఆదేశించారు. గురువారం తన కార్యాలయంలో జిల్లాలోని ఉద్యాన అధికారులు, సబ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఉద్యాన అధికారి తన పరిధిలోని నర్సరీలను ప్రతి నెల 100 శాతం తనిఖీ చేయాలని, రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అనే దానిని పరిశీలించాలన్నారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి రూ.6.81 కోట్లతో ప్రతిపాదనలు పంపామని, వీటికి త్వరలోనే ఆమోదం లభించే అవకాశం ఉందన్నారు. కొత్త తోటల విస్తరణ, పాత తోటల పునరుద్ధరణ తదితర కాంపోనెంట్ల కింద అర్హులైన లబ్ధిదారులను గుర్తించి సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సారి ఖరీఫ్‌లో ఉల్లి సాగు పెంచడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఏటా మే, జూన్ నెలల్లో కూరగాయల కొరత ఏర్పడుతోందని, ఈ కొరతను నివారించేందుకు వేసవిలో టమాట, ఉల్లి, మిర్చి సాగును ప్రోత్సహించాలని పేర్కొన్నారు.ఉద్యాన పంటల సాగు వివరాలను ప్రతి వారం పక్కాగా ఇవ్వాలని తెలిపారు. సమావేశంలో సాంకేతిక ఉద్యాన అధికారి అనూష, ఉద్యాన అధికారులు మదన్‌మోహన్‌గౌడు, శ్రీవాణి, ఇందిర, నరేష్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు